అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కుర్మిద్ద రోడ్డులో బ్రిడ్జి నిర్మించాలి

కల్వకుర్తి, జూలై 7 : కల్వకుర్తి నుంచి కుర్మిద్దకు వెళ్లే రోడ్డులో బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కొట్ర నుంచి నంద్యాల వరకు ఏర్పాటు చేస్తున్న 167కే జాతీయ రహదారి పనులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుర్మిద్ద రోడ్డులో బ్రిడ్జి నిర్మించాలని హైవే ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కల్వకుర్తి– కుర్మిద్ద మీదుగా దాదాపు 20–30 గ్రామాలకు వెళ్లే రోడ్డు ఉన్న నేపథ్యంతో కుర్మిద్దకు వెళ్లే దారిలో వంతెన నిర్మించాల్సిన అవసరం చాలా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

కల్వకుర్తి పట్టణంలోని సిల్వర్ జుబ్లీ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ ప్రారంభించారు. పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

- హాజరైన ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి

వంగూరు : రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు

వంగూరు, జూలై 7 : మండలంలోని హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారి నుంచి కొండారెడ్డిపల్లి వరకు రూ.21కోట్లతో నిర్మించనున్న నాలుగు లైన్ల రహదారి కోసం ఆదివారం అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో రూ. 2.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పాలశీతల కేంద్రానికి వారు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఈఈ నర్సింగ్, నాయకులు పండిత్‌రావు, కృష్ణారెడ్డి, వేమారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ అభివృద్ధికి కృషి చేయాలి

వెల్దండ, జూలై 7 : మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ పర్యావరణ అభివృద్ధికి కృషి చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం వెల్దండలోని జాతీయ రహదారి ప్రక్కన హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొని మొక్క లు నాటి నీరు పోశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను పెంచడంతోపాటు సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ప్రతి ఒక్కరం తమ వంతుగా ఒక్క మొక్క నాటుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, చంద్రకాంత్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, సురేందర్‌రెడ్డి, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుకు

దరఖాస్తు చేసుకోవాలి

పెంట్లవెల్లి, జూలై 7 : కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, కోడేరు, కొల్లాపూర్ మండలాల్లోని వివిధ గ్రామాల రైతులు ఆయిల్‌పాం సాగు కోసం దరఖాస్తు చేసుకోవాలని కొల్లాపూర్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మణ్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, భూమికి సంబంధించిన ఆర్‌వోఆర్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కంప్యూటర్లు వితరణ

కంప్యూటర్లు అందజేస్తున్న నాయకులు

ఊర్కొండ, జూలై 7 : మండలంలోని జగబోయిన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా, ఏటీ అండ్ టీ, లాయన్స్ క్లబ్ సైబరాబాద్, హార్టఫుల్ నెస్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి విద్యార్థుల కు కంప్యూటర్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్, బీజేవైఎం నాయకులు అరవింద్‌గౌడ్, వేణుగోపాల్, గిరిబాబు గౌడ్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

లింగాల, జూలై 7 : మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాహనాలు సీజ్ చేయడంతోపాటు తల్లిదండ్రులకు జైలు శిక్ష, జరిమానా ఉంటుందని ఎస్సై జగన్‌మోహన్ అన్నారు. ఆదివారం పట్టణంలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై జగన్‌మోహన్ మాట్లాడుతూ ఎస్సీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాల మేరకు మండలంలో వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా కొంతమంది వాహనదారులు తమ వాహనాలకు మెంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్నారని, అలాంటి వాహనాలను వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు.

క్రైం ఖబర్

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మృతి చెందిన సక్రి

వెల్దండ, జూలై 7 : విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన ఘటన వెల్దండ మండలం ఉబ్బలగట్టుతండాలో చోటు చేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన కథనం మేరకు ఉబ్బల గట్టుతండాకు చెందిన వి.సక్రి (50) కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చి ఇంటి గేటు తెరిచే క్రమంలో విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేట్‌కు షాక్ ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు గాయాలు..

నాగర్‌కర్నూల్, జూలై 7 : మండలంలోని పుల్జాల సబ్‌స్టేషన్‌లో ఆదివారం ఆపరేటర్ మహ్మద్ నసీరొద్దీన్‌కు విద్యుదాఘాతంతో గాయాలయ్యాయి. సరఫరా నిలిపివేసి పనులు చేస్తుండగా, చాలాకాలంగా ఏబీ స్విచ్‌లను మెయింటెనెన్స్ చేయకపోవడంతో ప్రమాదం జరిగిందని బాధితుడు పేర్కొన్నాడు. సబ్‌స్టేషన్ పక్కనే ఉన్న రైతులు ప్రమాదాన్ని గుర్తించి నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కల్వకుర్తి రూరల్, జూలై 7 : కల్వకుర్తి పట్టణంలోని రఘుపతిపేట ప్రధాన రహదారి గచ్చుబావి సమీపంలో బైక్‌పై నుంచి కింద తీవ్ర గాయాలైన రమేశ్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు కల్వకుర్తి ఎస్సై మాధవ రెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన రమేశ్ మూడు రోజుల కిందట బైక్ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు కాగా అతడికి కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానలో చికిత్స నిర్వహించి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రమేశ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి

బల్మూరు, జూలై 7: వేప చెట్టుకు ఉరేసుకోని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పొలిశెట్టిపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్సై ఇందిర కథనం మేరకు రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం వెల్లిచర్లకు చెందిన దొగ్గి యాదగిరి(33) ఇంట్లో కుటుంబ గొడవల కారణంగా కల్వకుర్తిలో ఉంటున్న తన అక్క ఇంటి వచ్చాడు. అక్కడి నుంచి మండలంలోని పొలిశెట్టిపల్లి గ్రామ శివారులో వేప చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి అన్న శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కోడేరు, జూలై 7 : ద్విచక్రవాహనం అదుపుతప్పి భార్యాభర్తలు గాయపడిన ఘటన మండలంలోని సింగాయిపల్లి–రాజాపూర్ గ్రామాల మధ్య ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం రేవల్లి మండల కేంద్రానికి చెందిన రాజయ్య, అతడి భార్య అంజనమ్మ పాన్‌గల్‌లోని బాలపీర్ల వద్దకు దైవ దర్శనం కోసం వెళ్లి వస్తున్నారు. కోడేరు మండలం రాజాపూర్–సింగాయిపల్లి గ్రామాల మధ్యను బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. పనుల కోసం నిల్వ చేసిన కంకర కుప్పలపై వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన భార్యభర్తలను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రేవల్లికి తరలించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

సారాను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

పెద్దకొత్తపల్లి, జూలై 7 : మండలంలోని మారెడుమాన్‌దిన్నెకు చెందిన పాట్లావత్ నర్సింహా సారా తీసుకెళ్తుండగా కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు పట్టుకొని 12 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు సీఐ నాగిరెడ్డి తెలిపారు. సారా కాసి అమ్మేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత : కేసు నమోదు

చారకొండ, జూలై 7 : వంగూరు మండలం డిండిచింతపల్లి వాగు నుంచి జూపల్లికి ఎలాంటి అనుమతి లేకుండా కొండారెడ్డిపల్లికి చెందిన రామకృష్ణ తన ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ చెప్పారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మండలంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి హామీ పథకం దిమ్మె ధ్వంసం

ధ్వంసమైన ఉపాధి హామీ పథకం దిమ్మె

కోడేరు, జూలై 7 : మండలంలోని ముత్తిరెడ్డిపల్లి శివారులో రోడ్డు వెంట ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకం దిమ్మెను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముత్తిరెడిపల్లి శివారులోని ప్రధాన రహదారులపై హరితహారం పథకం కింద నాటిన మొక్కల వివరాలను తెలపుతూ అధికారులు దిమ్మెలను ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని దండగులు ఆ దిమ్మెలను కూలగొట్టారని వివరించారు. ఈ విషయమై కోడేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

చైర్మన్‌ను సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

అచ్చంపేట, జూలై 7: అచ్చంపేట నూతన మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన గార్లపాటి శ్రీనివాసులును పలువురు సంఘాల నేతలు సత్కరించారు. ఆదివారం ఉదయం మార్నింగ్‌వాక్‌లో భాగంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. అలాగే పట్టణంలోని కన్యాకపరమేశ్వరి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్‌ను సత్కరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, చంద్రకుమార్, నరేశ్, కర్ణస్వామి, బాలరాజు, శ్రీను, రఘురాం, శివశంకర్, విజయ్‌కుమార్,భగీర్‌నాథ్, భాస్కర్, రూప్ల, నాగేశ్, నర్సోజి, శ్రీకాంత్, వేణు, సాయిరాం, బిచ్యా, లక్ష్మణ్ ఉన్నారు.

అసమానతల అంతానికి పోరాడాలి

మాట్లాడుతున్న వీరాంజనేయులు

అచ్చంపేటరూరల్, జూలై 7 : భారత దేశంలో అసమానతల అంతానికి ప్రతి ఒక్కరూ పోరాడాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరాంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలోని బాబుజగ్జీవన్ రాం భవన్‌లో జరిగిన రెండో రోజు జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతుల్లో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'దోపిడీ–దోపిడీ రూపాలు' అనే అంశంపై బోధిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నాయన్నారు. కేంద్రం కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న, ఉపాధ్యక్షుడు మల్లేశ్, ఆయా సంఘాల నాయకులు హన్మంత్, రాజు, మల్లేశ్, దేశ్యానాయక్, శంకర్‌నాయక్, వర్ధం సైదులు, శ్రీను, భాస్కర్, శివకుమార్, లక్ష్మణ్, సత్యానారాయణ పాల్గొన్నారు.

నిరంకుశ విధానాలను వీడాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ

సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్, జూలై 7 : పార్లమెంట్ ఎన్నికల్లో నిరంకుశ విధానాలను అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేండ్లలో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలుపగా, కులమత ప్రాంతాల పేరుతో చిచ్చు పెట్టే ప్రయత్నం చేసిందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి దేశాన్ని 30ఏండ్లు వెనక్కి తీసుకెళ్లారన్నారు. ఇటీవల వచ్చిన ఓట్ల ఫలితాలు చూసైనా పార్టీలన్నీ బుద్ధి మార్చుకొని ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. ఓ పక్క దేశం అభివృద్ధి చెందుతుందని చెబుతూనే మరోపక్క దేశంలో 80కోట్ల మందికి ఉచిత ఆహారాన్ని ఇస్తున్నామని చెప్పడం అభివృద్ధికి అడ్డం పడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కేశవులుగౌడ్, నాయకులు ఫయాజ్, వెంకటయ్య, నర్సింహా, చంద్రమౌళి పాల్గొన్నారు.

మైసమ్మకు బోనాలు

అమ్రాబాద్ : బోనాలతో వెళ్తున్న మహిళలు

అమ్రాబాద్, జూలై 7 : మండలంలోని దోమలపెంట గ్రామానికి వనమయూరి కాలనీ మహిళలు మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఆషాడమాసం తొలి ఆదివారం సందర్భంగా ఆగలపెంట గ్రామ శివారులోని మైసమ్మ తల్లికి డప్పు చప్పులతో బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనం సమర్పణ అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

లింగాల, జూలై 7 : వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగాపండాలని కోరుతు మండల కేంద్రంలోని మేరమ భవానీ ఆలయంలో బంజారులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో బంజారుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్‌కు బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మేరమా భవానీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాంజీ నాయక్, నిరంజన్, సీతారాం, బోడ్య, బాలు, దేవుల, కిషన్‌నాయక్, శంకర్‌లాల్, గోపి, రాములు, రవిందర్ పాల్గొన్నారు.

చెంచు ఈశ్వరమ్మను పరామర్శించిన మాజీ ఎంపీ

కొల్లాపూర్, జూలై 7 : మండలంలోని మొలచింతలపల్లిలో చెంచు ఈశ్వరమ్మ కుటుంబాన్ని ఆదివారం ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ బాబురావు పరామర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచులను గాలికి వదిలేశాయన్నారు. వారిపై నిత్యం హత్యలు, దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈశ్వరమ్మ ఘటన, నాగన్న మృతిపై పోలీసుల దర్యాప్తు నామమాత్రంగా జరిగిందన్నారు. మొలచింతలపల్లి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు.

పరామర్శించిన వారిలో అదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీంరావు, సహాయ కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

జనుంపల్లి వాసికి డాక్టరేట్

పీహెచ్‌డీ పొందిన శ్రీనివాస్‌గౌడ్

కోడేరు, జూలై 7 : మండలంలోని జనుంపల్లికి చెందిన బండారు శ్రీనివాస్‌గౌడ్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. శ్రీనివాస్‌గౌడ్ జనగామ పట్టణంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర సహాయ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ ఏకే సింగ్ డీఎంఆర్ఎల్ రిటైర్డ్ సైటిస్టు ఆధ్వర్యంలో మార్చి 2017 నుంచి పరిశోధన చేసి 22జూన్ 2024న పీహెచ్‌డీ వైవా ప్రజెన్‌టేషన్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. దీంతో జూలై 2న పీహెచ్‌డీనీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

రోడ్డు పక్కన ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

బిజినేపల్లి, జూలై 7 : మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. బిజినేపల్లి నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేకుండా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగాయి. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

మిషన్ భగీరథ నీళ్లు వృథా

కొల్లాపూర్, జూలై 7 : మండలంలోని అంకిరావుపల్లి గ్రామ సమీపంలో ఆదివారం మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ నుంచి లీకేజీతో నీళ్లు వృథా అవుతున్నాయి. గ్రామాల్లో తాగునీటికి కష్టాలు పడుతుంటే లీకేజీ అవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు ఉన్నారు. పైప్‌లైన్ మరమ్మతులు చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు

బదిలీ అయిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు

కల్వకుర్తిరూరల్, జూలై 7 : కల్వకుర్తి మండలం బెక్కర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పాఠశాల నుంచి బదిలైన ఉపాధ్యాయులకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల నుంచి బదిలీ అయిన హెచ్ఎం రఘురామారావు, ఉపాధ్యాయురాలు అంజలీలను పూలమాల వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, గ్రామ కార్యదర్శి కిరణ్, హెచ్ఎం అమీనా పర్‌వీన్, ఉపాధ్యాయులు, రాజేందర్ రెడ్డి, కొండల్ రెడ్డి, నరేశ్, ప్రవీణ్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ శ్యామల, ఆశ వర్కర్ మంజుల, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం

తిమ్మాజిపేట, జూలై 7 : మండలంలోని అప్పాజిపల్లి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన నర్వ సుదర్శన్‌రావు దంపతులు రూ.1,16,116లను ఆదివారం విరాళంగా అందజేశారు. ఆదివారం పూజల అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డికి నగదు అందించారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారావు, రఘునాథ్‌రావు, గంగాధర శర్మ ఉన్నారు.

మానవత్వం చాటిన స్నేహితులు

అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు

చారకొండ, జూలై 7: మండల కేంద్రానికి చెందిన రాగిపాని శ్రీనివాసాచారి పక్షవాతం వచ్చి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చారకొండలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1994–95 పదో తరగతి బ్యాంచ్‌కు చెందిన తన స్నేహితులు ఆదివారం బాధితుడిని పరామర్శించి రూ.50వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బాల్‌రాంగౌడ్, రవిచారి, శ్రీను, శంకర్‌గౌడ్, ఆనంద్, స్కైలాబ్‌గౌడ్, శ్రీనివాసులు, చింతపల్లిపాండుగౌడ్ తదితరులు ఉన్నారు.

మాదిగ

హక్కుల సాధనకు కృషి

అచ్చంపేట, జూలై 7: అణగారినవర్గాల హక్కుల సాధనకు ఆవిర్భావించించే ఎమ్మార్పీఎస్ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌట కాశీం అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకోని పట్టణంలోని ఎస్సీ కాంప్లెక్స్ ఎదుట ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్‌కట్ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహేశ్‌మాదిగ, సాం బయ్య, విజయ్, శ్రీరాములు, మల్లయ్య, సీహెచ్ వెంకటయ్య, రాజగోపాల్, బాలరాజు, కొండల్, ప్రవీణ్, సురేశ్, కుమార్, శ్రీకాంత్, రాజు, అనిల్, శంకర్ పాల్గొన్నారు.

వైద్యం అందక

గొర్రెలు మృతి

ఖిల్లాఘణపురం, జూలై 7 : సరియైన సమయంలో వైద్యం అందక గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామంలోని 2వేలకు పైగా ఉన్న గొర్రెల మందకు పుండ్లు అవుతున్నాయని ఇటీవల పశువైద్య శాఖ అధికారులు నివారణ కోసం మందులు వేశారు. శనివారం, ఆదివారం గొర్రెల కాపరి శంకరయ్యకు చెందిన 150గొర్రెలకు మందులు వేసినప్పటికీ 6గొర్రెలు మృతి చెందడంతోపాటు 30 గొర్రెలకు పైగా చనిపోయే దశలో ఉన్నాయి. దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని గొర్రెల కాపరి వాపోయారు. చివరకు సోలీపూర్‌కు చెందిన పశువైద్య శాఖ కాంపౌండర్ అక్కడికి చేరుకొని గొర్రెలను పరిశీలించి వైద్యుల సూచనల మేరకు మందులు ఇచ్చారన్నారు. వైద్యులు సకాలంలో స్పందించి ఉంటే తన గొర్రెలు బతికి ఉండేవని బాధితుడు వాపోయాడు. దీనిపై పశువైద్యాధికారిణి సుశాన్షిని వివరణ కోరగా ఆదివారం కాబట్టి అందుబాటులో లేనని సోమవారం అక్కడికి చేరుకొని గొర్రెలకు చికిత్స అందిస్తానని చెప్పారు.

వైద్యాధికారులు సకాలంలో స్పందించి మెరుగైన వైద్యం అందించి మూగ జీవాలను కాపాడాలని గొర్రెల కాపరులు కోరుతున్నారు.